క్లుప్తంగా

'సుంకేసుల'కు కొనసాగుతున్న ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి బ్యారేజీ (సుంకేసుల బ్యారేజీ)కి ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం బ్యారేజీలోకి 20,361 క్యుసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, కేసీ కాలువకు 2,445 క్యుసెక్కులు, నదిలోకి 17,916 క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రేపు వినతుల స్వీకరణ రద్దు

కర్నూలు (టౌన్): ఈనెల 16వ తేదీన నగరపాలక కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని మిలాద్-ఉన్-నబీ పండుగ సెలవు కారణంగా రద్దు చేసినట్లు నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం ఉండదని, నగర ప్రజలు గమనించాలన్నారు.

నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కర్నూలు న్యూసిటీ: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం వివిధ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. పదో తరగతి పాస్, ఇంటర్ పాస్, ఫెయిల్, 18 నుంచి 28 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న యువత దరఖాస్తు చేసుకోవలని సూచించారు.

కోల్స్ దొరకు ఘన నివాళి



కోల్స్ దొరకు నివాళులర్పిస్తున్న ఈఎస్‌టీ సభ్యులు

కర్నూలు (టౌన్): నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం కోల్స్ దొరకు ఘన నివాళులర్పించారు. కోల్స్ దొర విగ్రహానికి ఈవాంజికల్ సపోర్టింగ్ టీమ్ (ఈఎస్‌టీ) సభ్యులు పూలమాలలు వేశారు. ఈఎస్‌టీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ దాసరి సుధీర్ మాట్లాడుతూ కోల్స్ దొర 106 సంవత్సరాల క్రితం కర్నూలు నగరంలో విద్యాలయాలు, వైద్యశాలలు, చర్చీలు నిర్మించి ఎంతో మందికి ఉపాధి కల్పించార న్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సురేష్, జయాకర్, డేవిడ్ పాల్, జయాకర్, ప్రవీణ్, మోజస్, విజయ్‌కుమార్, సాగర్ పాల్గొన్నారు.

మహిళా సాధికార కేంద్రం పరిశీలన



మహిళా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్): అభాగ్యులైన మహిళలకు ఎన్‌టీఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం) చేయూతనందిస్తోందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చెప్పారు. శనివారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని మహిళా ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో మహిళలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం అభాగ్యులైన మహిళలకు ఎంతో సేవలు అందిస్తోందని చెప్పారు. నగరం నడిబొడ్డులో మహిళలకు రక్షణగా ఉన్న ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కేంద్రం నిర్వహణకు నిధుల కొరత గురించి అధికారి అంజనీభూషణ్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాలు తగ్గిన వెంటనే తన సొంత ఖర్చులతో జేసీబీ పెట్టి ప్రాంగణమంతా శుభ్రం చేయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. దీంతో పాటు దీని అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను రాబట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కేంద్రంలో ప్రభుత్వ శిక్షణ జరిగేలా కలెక్టర్‌తో చర్చిస్తానని చెప్పారు. ఆయన వెంట టీడీపీ వీరశైవ సాధికారత సమితి కన్వీనర్ ఎస్వీ శివరాజు తదితరులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

కర్నూలు సిటీ: విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఎప్పుడూ కూడా లక్ష్యాన్ని విస్మరించకూడదన్నారు. గతంలో తాను చదువుకున్న కాలేజీకే ఇప్పుడు పార్లమెంటు సభ్యుడిగా ముఖ్య అతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపుత్ర పాహిమాం



ఇందిరాగాంధీ నగర్‌లో



పాత కల్లూరులో



వడ్డేగేరిలో



ఎర్రబురుజులో




నేతాజీ వీధిలో

కర్నూలు కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కర్నూలు నగరంలో ఎనిమిదో రోజు శనివారం వినాయక ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు. మండపాల వద్ద లక్ష్మీ, గణపతి హోమాలు, సామూహిక కుంకుమార్చనలు, భజనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల వద్ద చిన్నారులకు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అల్పాహార, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ భక్తులకు అన్నదానం చేశారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్



పెద్దరంగరాజు వీధిలో



చిత్తారివీధిలో

మోక్షేశ్వరుడు, ప్రధాన కార్యదర్శి జంపాల జనార్దన్, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, జిల్లా సమన్వయకర్త డాక్టర్ నాగఫణి శాస్త్రి, తదితరులు వివిధ ప్రాంతాల్లోని వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.

కమనీయం వినాయకుడి కల్యాణం

కర్నూలు కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం గణనాథుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం వినాయక్ ఘాట్‌లో సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు.అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి కేసీ కెనాల్ నిమజ్జనం ఘాట్ వరకు ఊరేగించారు. అక్కడ లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, శిష్య బృందం స్వామివారికి, గంగమ్మ తల్లికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సందడి సుధాకర్, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా సమన్వయకర్త నాగఫణి శాస్త్రి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, సహ కార్యదర్శి రంగస్వామి, నగర అధ్యక్షులు మోక్షేశ్వరుడు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సిద్ధి బుద్ధి వరసిద్ధి వినాయక స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.







వినాయక మందిరంలో వినాయకుడి కల్యాణం, అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, 4వ వార్డులో వినాయకుడి వద్ద మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

నూతన భవనం నిరుపయోగం!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక భవన నిర్మాణం పూర్తి
- మార్చి 7న ప్రారంభించిన అప్పటి ఆర్థిక మంత్రి
- 7 నెలలు అవుతున్నా కొత్త భవనంలోకి వెళ్లేందుకు ఇష్టపడని అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): సర్వాంగసుందరంగా నిర్మితమైన సమీకృత ఆర్థిక భవనం నిరుపయోగంగా తయారైంది. ఈ ఏడాది మార్చి నెలలోనే భవనానికి ప్రారంభోత్సవం జరిగింది. దాదాపు 7 నెలలు అవుతున్నా... ఆర్థిక భవనంలోకి చేరడానికి సంబంధిత శాఖల అధికారులు సిద్ధంగా లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏసీ, లిఫ్ట్ పెట్టలేదని, సీటింగ్ బాగాలేదని, నీరు లేదనే కారణాలతో భవనంలోకి వెళ్లడం లేదు. అన్ని హంగులతో నూతన భవనం సిద్ధమైనప్పటికీ అరకొర సదుపాయాలు ఉన్న పాత వాటిల్లోనే ఉండటానికి ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది.

మాజీ మంత్రి బుగ్గన చొరవతో భవన నిర్మాణం పూర్తి

ఫైనాన్స్ బిల్డింగ్ నిర్మాణానికి 2018లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అప్పట్లోనే నిర్మాణపు పనులు ప్రారంభించారు. అయితే నాటి టీడీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి పట్టుదల, చొరవ తీసుకొని నిధులు విడుదల చేయించడంతో ఆర్థిక భవనం రూపుదిద్దుకుంది. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ బిల్డింగ్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.13.45 కోట్లు మంజూరు చేయగా, బి.క్యాంపులోని సీబీడీ కార్యాలయానికి సమీపంలో అపార్టుమెంటు తరహాలో 16.50 సెంట్ల స్థలంలో(7000 చదరపు అడుగులు) జీ+3



బి.క్యాంపులో రూ.13.45 కోట్లతో నిర్మించిన ఆర్థిక భవనం

అంతస్తులతో నిర్మించారు. భవనంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. ఏపీఈడబ్ల్యూడీసీ ఇంజినీరింగ్ అధికారులు దీనిని నిర్మించారు.

ఈ ఏడాది మార్చి 7న ప్రారంభం

మార్చి నెల 7వ తేదీన అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి భవనాన్ని ప్రారంభించారు. అయితే 7 నెలలు అవుతున్నప్పటికీ ఈ భవనంలోకి వెళ్లేందుకు ఆర్థిక శాఖకు సంబంధించిన విభాగాల అధికారులు సుముఖత వ్యక్తం చేయడంలేదు. నగరంలో ఏపీజీఎల్ఐ కార్యాలయాన్ని దశాబ్దాల తరబడి అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. పే అండ్ అకౌంట్స్ విభాగం కూడా అద్దెభవనంలోనే కొనసాగుతోంది. అద్దెల కింద ఏటా రూ.లక్షల రూపాయలు చెల్లిస్తున్నారు. అన్ని హంగులతో నూతన భవనం సిద్ధమైనప్పటికీ అరకొర సదుపాయాలు ఉన్న పాత వాటిల్లోనే ఉండటానికి ఇష్టపడుతున్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయం కలెక్టరేట్‌లోను, స్టేట్ ఆడిట్ కార్యాలయాన్ని సంక్షేమ భవన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ నాలుగు కార్యాలయాలతో పాటు కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని కూడా ఫైనాన్స్ బిల్డింగ్‌లోనే నిర్వహించాల్సి ఉంది. సొంతభవనంలోకి వెళ్లేందుకు ఈ శాఖల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

అదనపు నిధులకు ప్రతిపాదనలు పంపాం

భవన నిర్మాణానికి కేటాయించిన నిధులు అయిపోయాయి. అధికారులు ఏసీలు కావాలని అడుగుతున్నారు. అదనపు బడ్జెట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అలాగే సీటింగ్ మార్చాలని కోరుతున్నారు. నిధులు మంజూరైన వెంటనే వారు కోరిన విధంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. పనులు పూర్తి చేసి త్వరలోనే బిల్డింగ్‌ను హ్యాండ్‌ఓవర్ చేస్తాం.

– జీ.నాగరాజు, డీఈ, ఏపీఈడబ్ల్యూడీసీ

కాంట్రాక్టర్ ఉదాసీనత

సమీకృత ఆర్థిక భవనానికి లిఫ్ట్, సెంట్రల్ ఏసీ సదుపాయం కల్పించాలి. ఇది టెండర్ అగ్రిమెంటులోనే ఉంది. నిధులు లేవనే కారణంతో కాంట్రాక్టర్ పెండింగ్ పనులు చేపట్టడం లేదు. నిర్మాణపు పనులను చేపట్టిన ఏపీఈడబ్ల్యూడీసీ అధికారులు కూడా చొరవ తీసుకోవడం లేదు. సీటింగ్ బాగా లేదని, నీళ్లు లేవని అధికారులు చెబుతున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కంట్రాక్టర్ సుముఖంగా లేరనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు సమస్యలు పరిష్కరిస్తే సొంతభవనంలోకి వెళ్లేదుకు సిద్ధమేనంటున్నారు అధికారులు. అయితే వివిధ పనులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులు వత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

కోన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోన వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులతోపాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

లోక్ అదాలత్ ద్వారా బకాయిల వసూళ్లు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలో భవన అనుమతి ఫీజుల చెల్లింపుల్లో అంతులేని జాప్యం చేస్తున్న భవన యజమానులకు ఇటీవల జాతీయ లోక్ అదాలతక్ష నోటీసులు జారీ చేసింది. బకాయిలు చెల్లించకుంటే ఆస్తుల జప్తు చేస్తున్నట్లు నోటీసులు రావడంతో పలువురు యజమానులు స్పందించారు. శనివారం స్థానిక నగరపాలక కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కరోజు వ్యవధిలో 95 మంది బకాయిదారులు స్పందించారు. వీరి నుంచి బకాయిల మొత్తం రూ.25 లక్షలు వసూళ్లు చేసినట్లు నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు బకాయిలు చెల్లించని వారి ఆస్తులు జప్తు అవుతాయని



జాతీయ లోక్ అదాలత్‌లో బకాయి చెల్లిస్తున్న భవన యజమాని

వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రంగస్వామి, శశికళ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ దామోదర్, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంపూర్ణ భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్ : హృదయ మాలిన్యాన్ని తొలగించి, సదా భగవంతుడికి చేరువగా చేసే భగవద్గీత నిత్యాశ్రయ గ్రంథమని ధర్మప్రచారకులు విశ్వనాథ గురూజీ అన్నారు. గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో శనివారం సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఏకాదశిని పురస్కరించుకొని సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏకాదశికి సంపూర్ణ భగవద్గీత పారాయణం చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. పరివర్తన ఏకాదశి విశిష్టతను గురించి వివరించారు. ఏకాదశి మన బుద్ధిని పరమాత్మ వైపు మరల్చి, భగవంతునిలో ఐక్యమగుటకు ఉపయుక్తమగు కాలమన్నారు. భగవద్గీత పారాయణం చేయడం వలన జీవిత గమ్యం మారి, ఉన్నత స్థితికి చేరుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డి.వి.రమణ, సభ్యులు ఇల్లూరు రమణ, సింహాద్రి రమేష్, జగన్నాథ్ గుప్త, మహాబలేష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

పెద్దకడబూరు : మండలంలోని కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి దళిత మహిళపై దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నిందితుల్లో కొందరు చాకలి నాగరాజు, హుసేని, రాముడు, భీమరాజును శుక్రవారం రాత్రి అరెస్టు చేశామని, వారిని ఆదోని రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట శనివారం హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు. నిందితుల్లో మిగిలిన వారిని చాకలి భూలక్ష్మి, నరసమ్మ, లక్ష్మి, పెద్ద రంగమ్మ, గుండమ్మ శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు వివరించారు. దాడిలో పాల్గొన్న నిందితులందరినీ అరెస్టు చేశామన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు.

నేడు రాష్ట్రస్థాయి భజన పోటీలు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు గ్రామంలో మారెమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ. 20వేలు, రూ.15 వేలు, రూ.12వేలు, రూ.10 వేలు,రూ.8 వేలు, రూ. 6వేలు, రూ.5వేల నగదు అందజేస్తామన్నారు. సెల్ 9989272156, 9014919781 నంబర్లలో సంప్రదించాలన్నారు.





విక్రయానికి ఉంచిన వినాయకుడి చిత్రం ముద్రించిన టీషర్టులు, కొనుగోలు చేస్తున్న భక్తులు

నిమజ్జనోత్సవానికి వేళాయె

తొమ్మిది రోజులుగా పూజలందుకుని నిమజ్జనానికి సిద్ధమవుతున్న వినాయకుడికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు మండపాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొనేందుకు యువకులు డీజేలు సిద్ధం చేసుకున్నారు. అలాగే ఉత్సవాల్లో భక్తి భావం ఉట్టిపడేలా వినాయకుని ప్రతిమలు ఉన్న టీషర్టులు, గజమాలలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నగరంలోని వ్యాపారులు దుకాణాల్లో వివిధ రకాల టీషర్టులను విక్రయానికి ఉంచారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్

పీహెచ్‌సీల్లో నిలిచిపోయిన వైద్య సేవలు

సి.బెళగల్: జీఓ నంబర్ 85 వ్యతిరేకిస్తూ మండలంలోని సి.బెళగల్, పోలకల్ పీహెచ్‌లలోని వైద్యులు చేపట్టిన ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. దశలవారీ నిరసన కార్యాక్రమంలో భాగంగా శనివారం పీహెచ్‌సీలలో సాధారణ వైద్య సేవలు నిలిపివేశారు. సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్లు మాధునరెడ్డి, సునీత, పోలకల్ డాక్టర్లు హరిచంద్రుడు, శ్రావణి నల్ల బ్యాడ్జిలు ధరించి అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందించారు. పీహెచ్‌సీలలో అత్యవసర వైద్య సేవలు మినహా ఓపీ విధులను బహిష్కరించడంతో ముడుమాల, గొల్లలదొడ్డి గ్రామాల్లో 104 ఫ్యామిలీ డాక్టర్ సేవలను సైతం వైద్యులు నిలివేశారు. ప్రభుత్వం స్పందించకుంటే 16 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతామని డాక్టర్లు హెచ్చరించారు.